పని ప్రదేశాలలో ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలి

పల్నాడు జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి గంజిమాల రవికుమార్



కూలీలతో మాట్లాడుతున్న రవికుమార్

అచ్చంపేట: ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలలో తప్పనిసరిగా ప్రథమ చికిత్స కిట్స్, తాగు నీళ్ల, షేడ్ నెట్స్ అందుబాటులో ఉంచాలని పల్నాడు జిల్లా కార్మిక సంఘం కార్యదర్శి గంజిమాల రవికుమార్ తెలిపారు. మండలంలోని చెరుకుంపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలను సంఘాలుగా రిజిస్ట్రేషన్ చేసి మేస్త్రీలకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలన్నారు. తీసిన ఫొటోలు గ్రూపుల వారికి అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి పనికి వర్క్ ఐడీ ఇవ్వాలని, అన్ని పనులకు ఒకే వర్క్ ఐడీ ఇవ్వడం వల్ల కూలీలు నష్టపోతారని చెప్పారు. ప్రతి కూలీకి 150 రోజులు పని చూపించాలని, రోజువారీ వేతనం ప్రతి ఒక్కరికి రూ.350కు తగ్గకుండా ఇవ్వాలన్నారు. మేట్లకు ప్రత్యేక అలెవెన్స్‌లు కేటాయించాలన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రావెళ్ల వెంకటేశ్వర్లు, ఉపాధి పథకం మేట్లు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదుకు డిమాండ్



ఎమ్మార్పీస్ నాయకులతో కలిసి డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న బాధితుడు

అమరావతి: మండల పరిధిలోని లింగాపురంలో మాదిగ కులానికి చెందిన కంభంపాటి విద్యాధర్ కుటుంబంపై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లాల అధ్యక్షుడు చింతిరాల మీరయ్య డిమాండ్ చేశారు. శనివారం సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావుకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిందితులైన అదే గ్రామానికి చెందిన వారిపై కేసు నమోదు చేయకపోవటం దారుణమన్నారు. ఏప్రిల్ 26వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ కలెక్టర్‌కు దీనిపై అర్జీ ఇచ్చామన్నారు. అడిషనల్ ఎస్పీ సంతోష్‌కు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో బాధితుడు విద్యాధర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కర్లపూడి ప్రశాంత్, నూనె బాబురావు, కలకోటి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్ణీత ధరకే మద్యం విక్రయించేలా చర్యలు



సత్తెనపల్లి: మద్యం నిర్ణీత ధరకు విక్రయించేలా నిత్యం నిఘా ఉంచాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సర్కిల్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. బెల్ట్ షాపులు, ఎన్‌డీపీఎల్, గంజాయి సంబంధిత నేరాల నియంత్రణకు సంబంధించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



సత్తెనపల్లి: ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు దోహద పడతాయని సీనియర్ న్యాయవాది పీవీ నరసింహ శాస్త్రి అన్నారు. పట్టణంలోని తాలూకా న్యాయస్థాన ప్రాంగణంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, గుమస్తాలు, సిబ్బంది కుటుంబ సభ్యులకు డాక్టర్ అగర్వాల్ కంటి క్లినిక్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు చిన్నం మణి బాబు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు మేలు



అమరావతి: స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలలో భాగంగా గ్రంథాలయాధికారి లక్ష్మి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిషు, ఆటపాటలను విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా వి.లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత పెంచటానికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని వేసవిలో గ్రంథాలయానికి పంపితే వారికి పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుందన్నారు.

ప్రతి కార్మికుడు బీమా కార్డు పొందాలి



రాజుపాలెం: భవన నిర్మాణ కార్మికులకు కార్మిక శాఖ ఇచ్చే కార్డులు అందరూ తీసుకోవాలని పారాలీగల్ వలంటీర్ కోటా బాబూరావు తెలిపారు. మండలంలోని దేవరంపాడు ఎస్సీ కాలనీలో లీగల్ లిట్రసీ ప్రోగ్రామ్‌లో భాగంగా కార్మికులకు అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ప్రతి కార్మికుడు బీమా చేయించుకోవాలని, కార్మిక శాఖ నుంచి బీమా కార్డు పొందాలని ఆయన తెలిపారు. కార్మికులు కష్టాలలో ఉన్నప్పుడు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జిగురు అట్టల వాడకంపై అవగాహన



మాదల (ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా శనివారం జిగురు అట్టల వాడకంపై అవగాహన కల్పించారు. మిరప తోటలో జిగురు అట్టల ప్రాముఖ్యతను వివరించారు. తెల్లతెగులు, తామర పురుగులను ఆకర్షించి పట్టుకునేలా ఇవి పనిచేస్తాయని చెప్పారు. రసాయన మందులు వినియోగాన్ని తగ్గించడంలో ఎంతగానో దోహద పడతాయని వివరించారు. అమర్చే తీరుపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు టి.రేణుక, జె.సుమలి, కేవీ కృష్ణవేణి, బి.వర్షిణి స్వరాజ్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడికి పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న గంజి వీరాస్వామి

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు గంజి వీరాస్వామి 'భారత కీర్తి కిరీటి పురస్కారం' స్వీకరించారు. రెండున్నర దశాబ్దాలుగా సామాజిక సేవ చేస్తున్నందుకు తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థ మే 1వ తేదీన విశాఖపట్నంలో ఈ పురస్కారం ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు కట్టా శివ దుర్గారావు, వంగర మధు, వంగర శ్రీనివాసరావు, అవ్వారు ఏడుకొండలు శనివారం గంజి వీరాస్వామికి అభినందనలు తెలిపారు. ఆయన సేవా నిరతిని ప్రశంసించారు. మున్ముందు ఇలాంటి పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ గౌరవాన్ని అందించిన తెలుగు వెలుగు సాహితీ స్వచ్ఛంద సేవా సంస్థకు వీరాస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు శిక్షణ

సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం వారి సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, లెక్కలు, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం సబ్జెక్టులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీఆర్‌జేసీ విశ్రాంత ప్రిన్సిపల్ మిరియాల వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నుంచి ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు రూ. 516 నగదు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99590 33209, 98661 04843 ఫోను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అందుబాటులోకి ఈత, స్కేటింగ్ వసతులు



స్కేటింగ్ కోర్టును ప్రారంభిస్తున్న దరువూరి నాగేశ్వరరావు

సత్తెనపల్లి: ఈత, స్కేటింగ్ వసతులు సత్తెనపల్లిలో అందుబాటులోకి రావడం సంతోషదాయకమని డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పీఎం రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆర్‌కే స్కేటింగ్ కోర్ట్‌ను శనివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులకు అటవిడుపుగా క్రీడలు దోహద పడతాయన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తు చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండానే స్థానికంగా అందరికీ అందుబాటులో వసతులు రావడంతో ఎక్కువమంది నేర్చుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక యువత, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కేటింగ్ ఇన్‌చార్జి ఖాజా, పూల్‌ప్లాజా నిర్వాహకులు చంద్రశేఖర్, విజయ్, చందు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

7న వాసవీ అమ్మ వారి జన్మదిన వేడుకలు



కొలువుదీరిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి

రెంటచింతల: వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రేష్ఠి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు అమ్మవారి దేవస్థానంలో లలిత విష్ణు సహస్రనామ పారాయణం, 6.30 గంటలకు పతాక ఆవిష్కరణ, 10 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం, 102 మంది మహిళలతో కుంకుమ పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అమ్మవారి లడ్డు వేలం పాట దేవస్థానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 1 గంటకు తీర్థప్రసాదం, 1.30 గంటలకు భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి కోలాట భజన బృందం మేళతాళాలతో అమ్మవారి పతాకాలను చేబూని కీర్తనలను ఆలపిస్తూ రెంటచింతల గ్రామపురవీధులలో భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

లారీ ఢీకొని వివాహిత మృతి

నకరికల్లు: లారీ ఢీకొని వివాహిత మృతి చెందింది. ఈ ఘటన అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై చల్లగుండ్ల సమీపంలోని గోరంట్ల మేజర్ వద్ద శనివారం జరిగింది. రాజుపాలెం గ్రామానికి చెందిన వీర్ల కల్యాణి (65) మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. గోరంట్ల మేజర్ వద్ద రోడ్డు దాటేందుకు వేచి ఉండగా పిడుగురాళ్ల వైపు నుంచి వస్తున్న సిమెంటు లోడు లారీ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కల్యాణి లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కల్యాణి భర్త వీర్ల వెంకటస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. ఈ దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు.

నేడు నాగేంద్రస్వామి దేవస్థానం తిరునాళ్ల



గోలి(రెంటచింతల): మండలంలోని గోలి గ్రామ శివార్లోని అతి పురాతనమైన నాగేంద్రస్వామి దేవస్థానంలో వెలసిన దుర్గామల్లేశ్వరి, నీలం పాటి అమ్మవారు, అభయ ఆంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామరాజు కేశవరావు శనివారం తెలిపారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లకు పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారికి పొంగళ్లను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. ఈ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. రాత్రి 7 గంటలకు తిరునాళ్ల సందర్భంగా కుంకుమబండ్లతో గ్రామోత్సం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు చెప్పారు.

బంగారం చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

వివరాలు వెల్లడించిన జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు



నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

దాచేపల్లి: మహిళ ప్రయాణికురాలి నుంచి బంగారం చోరీ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జీఆర్పీ ఎస్ఐ వి.శ్రీనివాసరావు తెలిపారు. నడికుడి రైల్వేస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ తెల్లవారుజామున లింగపల్లి నుంచి కాకినాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు క్రాసింగ్ నిమిత్తం సిరిపురం రైల్వేస్టేషన్‌లో ఆగింది. రైలు బోగిలో ఉన్న ఓ మహిళ ప్రయాణికురాల మెడలో నుంచి బంగారం గొలుసు గుంటూరు శ్యామలనగర్‌కి చెందిన గుర్రప్పాడు రాయప్ప చోరీ చేశాడు. బాధిత ప్రయాణికురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలో తిరుగుతుండగా అరెస్ట్ చేసినట్లు వివరించారు. రైల్వేకోర్టులో నిందితుడిని హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు చెప్పారు. సమావేశంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ శ్రీస్తుదాస్, రైటర్ సరికొండ రామారాజు, కానిస్టేబుల్ కిషోర్ పాల్గొన్నారు.

నేడు డాక్టర్ రామకోటయ్యకు అవార్డు ప్రదానం

మాచర్ల: పట్టణంలోని కేసీపీ ప్రాంగణంలో డాక్టర్ వి.ఎల్.దత్ ఓపెన్ ఆడిటోరియంలో ఆదివారం డాక్టర్ రామకోటయ్య అందించిన విశిష్ట సేవలకు అవార్డు ప్రదానం చేయనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, కోశాధికారి లక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

వినుకొండ: పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్ వద్ద ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి దారివేముల మరియబాబు ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు 12 సంవత్సరాలు అధికారంలో ఉన్న నరేంద్రమోదీ యువతను మోసం చేశారన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఇప్పటికీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.38 లక్షల ఉద్యోగాల భర్తీకి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే గాలికి వదిలేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హామీలను నెరవేర్చాలని, లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

అంకమ్మకి వెండి పద్మపీఠం వితరణ



దాచేపల్లి: స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లికి వెండి పద్మపీఠం శనివారం అలంకరణ చేశారు. నారాయణపురానికి చెందిన అనిశెట్టి శ్రీనివాసరావు దంపతులు రూ.1.50 లక్షల విలువ చేసే వెండి పద్మపీఠం తయారు చేయించారు. ప్రత్యేకంగా పూజలు చేసిన శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి వెండి పద్మపీఠం బహూకరించారు. అమ్మవారి విగ్రహాన్ని వెండి పద్మపీఠంతో అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు యలమల నరేష్, దాత శ్రీనివాసరావు దంపతులను అభినందించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్



జెండా ఆవిష్కరణలో పలు సంఘాల నాయకులు

నకరికల్లు: కార్మికులకు పనికి తగిన వేతనం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. మే డేను పురస్కరించుకుని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో ప్రజా సంఘాలు, పీడీఎం, గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఎర్రజెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమ దోపిడీని అరికట్టాలన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాంకడావత్ కోటానాయక్, వినుకొండ సుభాని, అబ్దుల్ ఖాదర్, చల్లా వీరయ్య, మాట్ల మాబు, జైనా, మునాఫ్, చిన్న సైదా, పారిశుద్ధ్య కార్మికులు మార్తమ్మ, పిచ్చమ్మ, గురమయ్య, దేవంగి పెద దానియేలు, వర్ల చిన దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాలక్ష్మమ్మ తిరునాళ్ల



పూజలు నిర్వహిస్తున్న కేతావత్ బాలునాయక్, పాండు నాయక్

వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలో శనివారం మాలక్ష్మమ్మ అమ్మవారి తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించి చివరి రోజు మాలక్ష్మమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు కేతావత్ బాలునాయక్, సర్పంచి పాండునాయక్ అమ్మవారికి తెల్లవారుజామునే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కుబడులను తీర్చుకొని నైవేద్యాలను సమర్పించారు. భారీ అన్నదానం చేశారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

క్రోసూరు: నాటుసారా తయారీ దారులు, విక్రేతలపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు అన్నారు. శనివారం క్రోసూరు కార్యాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మణికంఠతో కలిసి ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. స్టేషన్ సీఐ టి.తులసి, ఎస్ఐ, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నాటు సారా రహితంగా గ్రామాలను తీర్చిదిద్దాలని సూచించారు.

విజ్ఞానం పెంచుతున్న శిబిరాలు



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులతో వై.వీరాంజమ్మ

క్రోసూరు: పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం, విజ్ఞానం కలుగుతుందని క్రోసూరు శాఖ గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం వీరాంజమ్మ మాట్లాడుతూ నేటి విద్యార్థులు ఫోన్ల ప్రభావంతో పుస్తకపఠనం పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని అన్నారు. పుస్తకాలు మంచి నేస్తాలు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలు విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఇండోర్ గేమ్స్ ఉండటంతో విద్యార్థులు క్రమం తప్పకుండా వస్తున్నట్లు తెలిపారు.

కార్మికులు హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- న్యాయమూర్తి కె. నరేంద్రరెడ్డి
- తిమ్మాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి

యడ్లపాడు: అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వం కల్పించిన చట్టబద్ధమైన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె. నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల సందర్భంగా శనివారం తిమ్మాపురంలోని వసంత నూలుమిల్లులో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగించారు. కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని, ప్రతి కార్మికుడూ పనికి తగ్గ వేతనం పొందే హక్కు కలవాడని తెలిపారు. బాల కార్మికుల నియామకం నిషిద్ధమని, దానికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను కూడా వివరిస్తూ, అవగాహన కల్పించారు. అలాగే, కార్మికులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించి, మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని సూచించారు. చట్ట పరంగా అందుబాటులో ఉన్న అన్ని సేవలను వినియోగించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో చిలకలూరిపేట బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్ ప్రసాద్, న్యాయ వాదులు పి. వెంకటేశ్వరరావు, ఎ.శివ రావు, ఏఎస్ఐ వెంగయ్య, హెచ్ఆర్ఎం పుల్లారావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రయోజనాలు



రెంటచింతల: పుస్తక పఠనంతో జ్ఞానం, విజ్ఞానం పెంపొందుతుందని స్థానిక శాఖాగ్రంథాలయ అధికారి రాయపాటి రాజ కిశోర్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు పుస్తక పఠనం వలన కలుగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వలన మన పూర్వీకులతో మాట్లాడిన అనుభూతి కలుగుతుందని, నైతిక విలువలు, క్రమశిక్షణ, సంస్కారం వంటి మంచి లక్షణాలు తెలుస్తాయన్నారు. శిబిరంలో కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పటం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్, గేమ్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఈ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణం శ్రీనివాస్ పాల్గొన్నారు.